# వేట

— వాడ్రేవు రమాదేవి

కోర్టు హాలు జనంతో కిటకిటలాడిపోతోంది. జడ్జిమెంటు చెప్పే రోజది. అందరి మనసుల్లో ఒకటే ఆలోచన.. ఏం చెప్తారో! అని.

"కరుణాకరం మాస్టారెంత మంచి ఆయనో?"

"అయిదు సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందంటావా?"

"ఏమో మరి, ఏం జరుగుతుందో?"

బోనులో నిలబడిన కరుణాకరం గారి తల భూమిలోకి దిగిపోయింది. తను ఇంకా బ్రతికేవున్నాడా? నేల చీలిపోయి తను అందులోకి దిగిపోతే ఎంత బాగుండును? తరాలు మారినా తరగని అపఖ్యాతి. 'పెద్దల మాట చద్ది అన్నపు మూట' అని ఒకటో క్లాసు కాపీ పుస్తకాల్లో రాసే సూక్తిలో ఎంత నిజముంది? ఆలోచిస్తూ నిల్చున్నవాడు నిల్చున్నట్టుగా కిందకు కుప్పకూలిపోయాడు.

* * *

"మనం వేసే ప్రతి అడుగు ఆచి తూచి వెయ్యాలిరా! ఆలోచించకుండా వేసిన అడుగులను వెనక్కు తీసుకోవాలంటే చాలా కష్టం."

"అబ్బ! ఏంటి నాన్నా! మీరు దేని గురించి మాట్లాడుతున్నారు?" విసుక్కున్నాడు తండ్రి మాటలకు కరుణాకరరావు.

"తను ఏ. పని చేసినా అలా ఏదో వంక చెబుతూ దెప్పి పొడుస్తూనే వుంటారు నాన్నగారు" అని తనలో తాను అనుకుంటూ బూటు లేసులు ముడివేసుకుంటున్నాడు.

"ఇదిగో! నేను కాలేజీకి వెళ్ళొస్తాను" అన్నాడు భార్య నుద్దేశిస్తూ.

"వస్తున్నా! ఒక్క నిమిషం ఆగండి. రేపు మన పెళ్ళిరోజు. నాకో మంచి చీర తెచ్చిపెట్టండి సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు."

"నీకేనా? నాకేం అక్కరలేదా?"

"మీరూ తెచ్చుకోండి, రెడీమేడ్‌వి వుంటాయిగా!"

"సరేలే, అదొక్కటే తక్కువైంది."

"అన్నట్టు చెప్పడం మరచిపోయాను. ప్రొద్దున్నే ఎవరో ఇద్దరబ్బాయిలు వచ్చి ట్యూషన్ చెబుతారా అని అడిగారు. రేపట్నుంచీ రమ్మనమని చెప్పాను. రేపు మంచిరోజు కూడా. అయినా మీరు ఒప్పుకుంటారన్న ధైర్యంతో మాట ఇచ్చేశానండి. ఏదో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడు" రకరకాల స్వరస్థాయిలతో గొంతు మార్చిమార్చి చెబుతున్న భార్య చాతుర్యానికి విస్తుపోతూ.

"నువ్వు చాలా తెలివిమీరిపోయావు శాంతా! వాళ్ళకి పాఠాలు కూడా నువ్వే చెప్ప. తెల్లవారుఝామున నాకు హాయిగా పడుకోవాలని వుంటుంది. ఆ టైములో పిల్లలకు పాఠాలు చెప్పమంటే నాకు మహా చిరాకు. నా సంగతి ఆలోచించకుండా నువ్వు వాళ్ళకి మాటిచ్చి తప్పు పని చేశావు."

"అవునండీ! మీకన్నీ కష్టమే. డబ్బు సంపాదించడం రాదు. మీతో పని చేసే రాఘవరావుగారు, సుందర్రావు గారు ఎంతెంత ఆస్తులు సంపాదిస్తున్నారో! మనం... ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వేసినట్టుగా వున్నాం. కనీసం పిల్లల్ని మంచి కాన్వెంట్‌లోనైనా చేర్పించే తాహతు లేదు. ముసలాళ్ళ రోగాలకే డబ్బంతా హరించుకుపోతోంది. ఇద్దరు పిల్లలకు పాఠాలు చెప్పమన్నాను. అంతే గద!" ముక్కెగబీలుస్తూ అంది.

"సరేలే, ఏదన్నా అంటే ఇదొక అస్త్రం ప్రయోగిస్తావు" విసుక్కుంటూ కాలేజీకి వెళ్ళిపోయాడు.

* * *

కరుణాకరరావుకి ఆ కాలేజీలో మంచి పేరుంది. మరీ పల్లెటూరు, పట్నం కాని ఆ వూళ్లో కాలేజీలో లెక్చరరు ఉద్యోగం చేసుకుంటున్న కరుణాకరరావు తన జీతంతో తృప్తిగానే బతుకుతున్నాడు. కానీ పక్కింట్లోకి రాఘవరావుగారు అద్దెకొచ్చినప్పటినుంచీ ఇంట్లో శాంత పోరు ఎక్కువైంది. ప్రతి విషయానికి వాళ్ళతో పోల్చుకుని తనను తాను కించపరచుకుంటూ వుంటుంది. ఈ అసంతృప్తి విషవృక్షంలా వ్యాపించింది శాంత మెదడులో. భర్త హితబోధలన్నీ భరించలేకపోతోంది. ఎదుగు బొదుగూ లేని జీతంతో ఎంత పైసా పైసా కూడబెడుతున్నా అవి ఏ ఒక్క అవసరాన్నీ తీర్చలేకపోతోందన్న నిరాశ, ముసలాళ్ళైన అత్తమామల రోగాల కయ్యే ఖర్చు- ఇవన్నీ శాంతలో అసహనాన్ని, కోపాన్ని, ఉద్రేకాన్ని పెంచేలా చేశాయి.

* * *

"సార్! ఇది మీకు మంచి ఆఫర్. కాదనకండి. బాగా ఆలోచించుకోండి. మీరు నెలంతా కష్టపడి సంపాదించినదానికి, మేమిచ్చేదానికి ఎంత తేడా వుందో చూసుకోండి. మధ్యాహ్నపు భోజనం కూడా మీరు మాతోపాటే చెయ్యవచ్చు. ఉండడానికి మంచి ఇల్లు ఇస్తాం. కావలసిన వసతులన్నీ కల్పిస్తాం. మీరు మా సంస్థలో పనిచేస్తే మా సంస్థకు మంచి పేరు వస్తుందన్న ఆశ సార్. ప్లీజ్! ఒప్పుకోండి సార్! మీకు, మీ ఫ్యామిలీకి ఏ లోటూ రాకుండా చూసుకునే బాధ్యత మాది. మీరూ ఆలోచించుకోండి. మళ్ళీ రేపు కలుస్తాను సార్" అని వెళ్ళిపోయారు ఆ వచ్చినవాళ్ళు.

మరునాటిరోజు కాలేజీకి వెళ్ళబోతున్న కొడుకును ఆపి, "ఏం నిర్ణయించుకున్నావు" అని అడిగాడు తండ్రి.

"ఇంకా ఏం నిర్ణయించుకోలేదు నాన్నా! నేను పరుగెత్తి పాలు తాగలేను"

"అదే మంచి పద్ధతి. నిలబడి నీళ్ళే తాగాలి" స్థిరంగా అన్నారు కరుణాకరరావు తండ్రి.

"ఏమండీ, ఇలా వస్తారా?"

"ఏమిటీ. మళ్ళీ ఏ గొడవ మొదలు పెట్టావు?"

"వచ్చిన అవకాశం చేజార్చుకోవడం ఉత్తముల లక్షణం కాదు. మీరు ఇంకేం ఆలోచించకండి. వాళ్ళు వస్తే జాబ్‌కి రిజైన్ చేస్తానని చెప్పండి" శాంత ఉద్బోధ.

* * *

కరుణాకరం మనసు ద్వైదీభావంతో కొట్టుకుంటోంది. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటే భవిష్యత్తు బావుంటుందేమోనన్న చిరు ఆశ. ఎన్నేళ్ళయినా ఎదుగూ బొదుగూ లేని సంపాదన. ట్యూషన్లు చెప్పి డబ్బు సంపాదించాలన్నా ఉత్సాహం లేదు. ప్రైవేటు కాలేజి అయినా కాలేజి ఉద్యోగమే. సాయంకాలాలు ఇంటిదగ్గర పిల్లలతో గడపవచ్చు. తండ్రికి కబుర్లు చెప్పకోవచ్చు. కొన్నాళ్ళు సెలవుపెట్టి, ఆ కొత్త కాలేజీలో చేరి చూస్తే తనకు నచ్చితే వుండొచ్చు. లేకపోతే సెలవు కాన్సిల్ చేసుకుని మళ్ళీ పాత ఉద్యోగంలో చేరిపోవచ్చునన్న నిర్ణయానికి వచ్చేశాడు. తండ్రితోనూ ఆ విషయమే చెప్పాడు.

* * *

చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకుంటున్నట్టుగా కాలేజి యాజమాన్యం కరుణాకరరావుగారి పేరు చెప్పకుంటూ విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్చుకున్నారు.

ఆ ప్రైవేటు సంస్థ మూడు కాలేజీలు, ఆరు హాస్టళ్ళుగా ప్రవర్థమానం చెందుతోంది.

కాలం మార్పులతో వచ్చింది ముందు వేసవి. దాంతోపాటే సంవత్సరాంతపు పరీక్షల సీజను. తమ విద్యార్థులంతా మంచి మార్కులతో పాసయ్యి తమ సంస్థకు మంచి పేరు రావాలంటే వున్న ఆశాకిరణం ఒక్కటే. పరీక్షా ప్రశ్న పత్రాల్ని సంపాదించి పిల్లలకు అందివ్వాలన్నదే. పట్టువదలని విక్రమార్కుల్లా తీగలన్నీ కదిలించి డొంకను వెతికి పట్టుకున్నారు. కానీ ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. గుట్టంతా రట్టయింది. చీకటిలో జరగవలసినదంతా వెలుగులోకి వచ్చేసింది. 'అయ్యయ్యో' అని నాలుక్కరచుకున్నా లాభం లేకపోయింది.

కరుణాకరరావుగారు ఆ పాలెగూట్లో ఈగయ్యాడు. తన ప్రమేయమేమీ

లేకుండానే తనను బలి పశువుగా మార్చి చూపిన ప్రైవేటు సంస్థ చిత్తులకు తలవొగ్గవలసి వచ్చింది. ఇప్పుడేం చేయాలి? తనకు ఈ వ్యవహారంతో సంబంధమేమీ లదని చెప్పినా వినిపించుకునే నాథుడెవ్వరూ లేరు. బయటపడే దారులన్నీ మూసుకుపోయాయి.

భవిష్యత్తంతా కటిక చీకటయిపోయింది కరుణాకరరావుకి.

రెక్కలు రాని పిల్లలు దీనంగా కనిపిస్తున్నారు. తన చిన్నారుల సుందర భవిష్యత్తును తనే బలవంతంగా చెరిపేశాడు.

రెక్కలుడిగిపోయిన తండ్రి 'ఇలా అయ్యిందేమిటిరా?' అంటూ దిగులుగా చూస్తున్నట్టుంది. అత్యాశకు భర్తను ప్రోత్సహించిన భార్య ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు. ప్రపంచపు కారుకూతలు వినిపించకుండా గది తలుపులు బిడాయించుకుని తపోనిష్టలోకి వెళ్ళిపోయాడు తండ్రి.

ఆకలి ప్రపంచంలో ఈ నిర్భాగ్యులంతా ఎలా బ్రతుకుతారు? సంస్థ చెప్పిన తియ్యని మాటలన్నీ చేదు విషాలయ్యాయి. ఊసరవెల్లి రాజ్యంలో కదిలిపోయిన తన కుటుంబ పునాదిని పునర్నిర్మించుకోగలడా?

తప్పు ఎవరు చేసినా, ఎంతటివారు చేసినా శిక్షార్హులే. తనని దండించడం అన్యాయం. తను స్వయంగా ఏ తప్పూ చేయలేదు.

తనని ఈ గూట్లో చిక్కుకునేలా చేసింది ఆశ. శిక్షంటూ పడితే ఆశకు పడాలి. ఈ ఆశే తనని, తనవారి జీవితాన్ని ఇంతగా దుఃఖభాజనం చేసింది. ఇక తనకు మిగిలినదంతా శూన్యం. ఈ ఆశని చిన్న మొలకగా వున్నప్పుడే తుంచేయలేకపోయాడు. పైగా దాన్ని ఎదిగేందుకు ప్రోత్సహించాడు. ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాడు. నేడు లేనిదేదో రేపు దక్కుతుందనుకున్నాడు. దీనివలన భరించరాని శోకం మిగిలింది. తనని చూసి అందరూ పగలబడి నవ్వుతున్నట్టుగా వుంది. ఈ స్థితికి బాధ్యులైన వాళ్ళు తప్పించుకోవడానికి వీల్లేదు. ఎప్పటికైనా నిజం లోకానికి తెలియాల్సిందే.

* * *

కుప్పకూలిపోయిన కరుణాకరరావు మాస్టారి నిర్జీవ శరీరాన్ని ఇంటికి చేర్చింది కోర్టు.

★

